# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people


## యూజీడీ ప్రాజెక్ట్ పై కమిషనర్ సమీక్ష

- టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశం

2




శనివారం 25, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 156 | పేజీలు : 05 | వెల ₹5




## అడవి దాటి వెళ్లి ఆపద్బాంధవులయ్యారు

- ఉట్ల గుత్తి కోయగూడెంలో కాలినడకన వెళ్లి ఉచిత వైద్య శిబిరం
- వర్షా కాల వ్యాధులు, జ్వరాల పట్ల ప్రజలు అజాగ్రత్తగా ఉండొద్దు
- పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్

3




## పోలీసులతో ఎస్పీ దర్బార్

- సేవాస్ఫూర్తికి ప్రశంసలు, రివార్డులు.. సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత
- కర్రెగుట్టల రహదారి పనుల్లో ప్రతిభ చూపిన సిబ్బందికి అభినందనలు

2




# సూపర్ ఎల్‌నినో ఎఫెక్ట్

### నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలే శ్రేయస్కరం

- ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించాలి
- ఆగస్టు 30 నాటికి విద్యార్థులందరికి యూనిఫాంలు అందించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

2

రాష్ట్రంలో నెలకొన్న 'సూపర్ ఎల్‌నినో' పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలను అందించాలని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, సెర్ప్ సీఈవో దివ్యలతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా నుంచి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ.. జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలు నిర్వహించాలి. కంది, పెసర, మినుములు, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల యూనిఫాంల తయారీలో వస్త్రాల సరఫరా నుంచి కుట్టు పనుల వరకు ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించి, నాణ్యత తగ్గకుండా చూడాలని చెప్పారు. - అక్షరదర్బార్, హనుమకొండ



## కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాం

- పేదలు వేసుకున్న గుడిసెల కూల్చివేతలు ఆపి, పట్టాలు ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత నాది.. ఎమ్మెల్యే నాగరాజు
- వరంగల్‌లో 'ఏబీ బర్ధన్ భవనం' ప్రారంభోత్సవం

3

## యాక్సిడెంట్.. ఇద్దరు మృతి

- పాలకుర్తి మండలం బమ్మెర శివారులో ఘోర రహదారి ప్రమాదం
- నర్సింగాపురం తండాలో విషాదం



3

# సూపర్ ఎల్ నినో ఎఫెక్ట్

## నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలే శ్రేయస్కరం

- ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
- 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహించాలి
- ఆగస్టు 30 నాటికి విద్యార్థులందరికి యూనిఫాంలు అందించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశం
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్రంలో నెలకొన్న 'సూపర్ ఎల్‌నినో' పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలను అందించాలనిస్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, సెర్ప్ సీఈవో దివ్యలతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా నుంచి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ.. జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలు నిర్వహించాలి. కంది, పెసర, మినుములు, అలసందలు, పొద్దుతిరుగుడు, చిరుధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల యూనిఫాంల తయారీలో వస్త్రాల సరఫరా నుంచి కుట్టు పనుల వరకు ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించి, నాణ్యత తగ్గకుండా చూడాలని చెప్పారు.

తక్కువ నీటి పంటలపై అవగాహన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాలోని అధికారులతో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే పంటలపై గ్రామాల వారీగా ప్రత్యేక బృందాలతో రైతులకు ప్రచారం నిర్వహించాలి. పప్పుధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను వివరించే కరపత్రాలను రూపొందించి రైతులకు పంపిణీ చేయాలి. రైతు వేదికల్లో విత్తన మేళాలను విజయవంతం చేయడంతో పాటు, విద్యార్థులకు నిర్ణీత గడువులోగా నాణ్యమైన యూనిఫాంలు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న, డీఆర్‌డీఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఈవో గిరిరాజ్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, గురుకుల విద్యాసంస్థల అధికారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 8 మంది అరెస్ట్, రూ.5,430 నగదు స్వాధీనం

అక్షరదర్బార్, కాటారం: సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో 8 మంది నిందితులను అరెస్టు చేయగా, వారి వద్ద నుంచి రూ.5,430 నగదు, 3 ద్విచక్ర వాహనాలు, 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడి జరుగుతున్న సమయంలో మరో ఒక నిందితుడు పరారయ్యాడు. అరెస్టయిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కాటారం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుడిని గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

# పోలీసులతో ఎస్పీ దర్బార్

- సేవాస్ఫూర్తికి ప్రశంసలు, రివార్డులు.. సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత
- కర్రెగుట్టల రహదారి పనుల్లో ప్రతిభ చూపిన సిబ్బందికి అభినందనలు




అక్షరదర్బార్, ములుగు: జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ పార్టీ సిబ్బందితో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ శుక్రవారం ప్రత్యేక దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమ అంశాలు, భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలను ఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

### సమస్యలపై తక్షణ స్పందన

దర్బార్‌లో సిబ్బంది పలు ప్రతిపాదనలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో తాగునీటి కోసం వాటర్ ప్లాంట్, సిబ్బంది విశ్రాంతి కోసం పోలీస్ వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని కోరగా, వాటిని వెంటనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. మేడారం జాతర సమయంలో అధికారుల చొరవతో లభించిన ప్రయాణ భత్యం లాగే, ఇంకా రావాల్సిన మిగతా నెలల టీఏ బకాయిలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కఠిన సేవా పథకాలకు అర్హులైన వారి వివరాలను నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న స్పెషల్ పార్టీ, బాంబు స్క్వాడ్ సిబ్బందికి 'ఆక్సిలరీ ప్రమోషన్లు' కల్పించే అంశాన్ని కూడా ఉన్నతాధికారుల సిఫారసుకు పంపినట్లు వెల్లడించారు.

కర్రెగుట్టల విజయంపై అభినందనలు ఇటీవల తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా కర్రెగుట్టల కొండ ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేయడంలో స్పెషల్ పార్టీ సిబ్బంది చూపిన కృషిని ఎస్పీ ప్రత్యేకంగా కొనియాడారు. వారి అంకితభావం, క్రమశిక్షణను గుర్తిస్తూ ఉన్నతాధికారుల చేతుల మీదుగా త్వరలోనే ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. "స్పెషల్ పార్టీ సిబ్బంది ములుగు జిల్లా పోలీసు శాఖకు వెన్నెముక లాంటివారు. వారి సంక్షేమం, సేవలకు తగిన గుర్తింపు ఇవ్వడమే మా మొదటి ప్రాధాన్యత. నిజాయితీగా పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుంది. భవిష్యత్తులోనూ ఇదే సేవాస్ఫూర్తితో ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేయాలి." అని కేకన్ సుధీర్ రామనాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డీఎస్పీ (ఇన్‌చార్జి ఓఎస్డీ) నలువాల రవీందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆపరేషన్స్) డి తిరుపతి, ములుగు సీఐ దారం సురేష్, ఆర్ఎస్ఐలు గోపి, ప్రశాంత్, అవినాష్, సందీప్, రాకేష్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# యూజీడీ ప్రాజెక్ట్ పై కమిషనర్ సమీక్ష

- టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఆదేశం

అక్షరదర్బార్, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) ప్రాజెక్టు టెండర్ ప్రక్రియ పురోగతిపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న శుక్రవారం సుదీర్ఘంగా సమీక్షించారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు మరియు 'బిల్డ్‌కాన్' సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా టెండర్ ప్రక్రియ ప్రస్తుత స్థితి, నిబంధనలు, తదుపరి చేపట్టాల్సిన సాంకేతిక చర్యలపై అధికారులతో సవివరంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి సాంకేతిక అంశాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రాజెక్టును పట్టాలెక్కించాలని సూచించారు.

### 7 ఎస్‌టీపీల భూసేకరణ పూర్తి

కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేయబోయే 7 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల (ఎస్టీపీ) కోసం అవసరమైన స్థలాల సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియ ప్రస్తుతం తుది దశకు చేరుకుందని, మిగిలిన ప్రక్రియలను కూడా వేగవంతం చేసి వీలైనంత త్వరగా క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యూజీడీ వ్యవస్థను పక్కా ప్రణాళికతో రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో బల్దియా సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) రాజ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) రవికుమార్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, బిల్డ్‌కాన్ సంస్థ ప్రతినిధి అగర్వాల్‌తో పాటు పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.





# అడవి దాటి వెళ్లి ఆపద్బాంధవులయ్యారు

- ఉట్ల గుత్తి కోయగూడెంలో కాలినడకన వెళ్లి ఉచిత వైద్య శిబిరం
- వర్షా కాల వ్యాధులు, జ్వరాల పట్ల ప్రజలు అజాగ్రత్తగా ఉండొద్దు
- పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్



అక్షరదర్బార్ , వెంకటాపూర్ : బాహ్య ప్రపంచానికి దూరంగా, ఏజెన్సీ గుండెల్లో నివసించే గిరిజనుల ఆరోగ్యమే ధ్యేయంగా వైద్య బృందం కదలివెళ్లింది. వెంకటాపూర్ మండలంలోనిలక్ష్మీదేవిపేటగ్రామపంచాయతీ పరిధిలోని ఉట్ల గుత్తి కోయగూడెంనకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలో సిబ్బంది అడవి మార్గాన కాలినడకన వెళ్లి ఉచిత ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముళ్లబాటలు, కష్టతరమైన ప్రయాణాన్ని సైతం లెక్కచేయకుండా గూడెం చేరుకున్న వైద్యులు అక్కడి 90 మంది గిరిజనులకు పలు రకాల ఆరోగ్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడంతో పాటు బాధితులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ...వర్షాకాలంలో ప్రబలే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల పట్ల అజాగ్రత్తగా ఉండవద్దని సూచించారు. ప్రతీ ఒక్కరూ నీటిని కాచి వడబోసి తాగాలని, వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వెంకటాపూర్ పిహెచ్‌సిని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి నవీన్, ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణలత, వజ్ర, సుశీల, ఆశా కార్యకర్తలు రజిత, కవిత, వినోద, స్వాతి, సబిత, లక్ష్మీదేవిపేట పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# యాక్సిడెంట్.. ఇద్దరు మృతి

- పాలకుర్తి మండలం బమ్మెర శివారులో ఘోర రహదారి ప్రమాదం
- నర్సింగపురం తండాలో విషాదం



అక్షరదర్బార్, పాలకుర్తి: జనగామ జిల్లాలో శుక్రవారం ఘోర రహదారి ప్రమాదం సంభవించింది. లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ విషాద సంఘటన పాలకుర్తి మండలం బమ్మెర గ్రామం శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పాలకుర్తి మండలం నర్సింగపురం తండాకు చెందిన కేతావత్ నరేందర్, బాదావత్ తిరుపతి అనే ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, బమ్మెర శివారులోకి రాగానే రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని గమనించక వేగంతో ఢీకొట్టారు. ఈప్రమాదంలోబైక్‌తీవ్రంగాధ్వంసమవ్వడమే కాకుండా, తలకు తీవ్ర గాయాలు కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పాలకుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో నర్సింగపురం తండాలో తీవ్ర విషాదం అలుముకుంది.

# ప్రజా ఉద్యమంలా జలసిరి

- వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రతి గ్రామంలో కాంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేయాలి
- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశాలు



అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, తీవ్ర నీటి ఎద్దడి పరిస్థితులనుసమర్థవంతంగాఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "తెలంగాణ జలసిరి" కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంలా చేపట్టి విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోజలసంరక్షణపనులపురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని ప్రతి చుక్కనూ ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు (పర్కొలేషన్ ట్యాంకులు), పంటకుంటలు (ఫార్మ్‌పాండ్స్), బోర్‌బావుల రీఛార్జ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఫార్మ్ పాండ్స్‌తో రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు**

ఫార్మ్ పాండ్స్ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని, అర్హులైన రైతులు తమ పొలాల్లో పంట కుంటలు, బోర్‌బావుల రీఛార్జ్ పనులు చేపట్టేలా చైతన్యం తేవాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు బోర్‌బావుల రీఛార్జ్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలంగాణ జలసిరి పనులపై టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు జిల్లాస్థాయి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సమగ్ర కాంటింజెన్సీ ప్లాన్ సిద్ధం చేయాలి సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎల్‌నినో పరిస్థితులు, నీటి సంరక్షణ పద్ధతులపై అవగాహనకల్పించాలనికలెక్టర్‌ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని, సోమవారం నాటికి ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించిన కాంటింజెన్సీ ప్రణాళిక నివేదికను అందజేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

**రైతులకు సీడ్ మేళా**

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన విత్తనాల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నిర్దేశిత లక్ష్యాల వివరాలను డీఆర్డీవో మేన శ్రీను వివరించగా.. జడ్పీ సీఈవో శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాం

- పేదలు వేసుకున్న గుడిసెల కూల్చివేతలు ఆపి, పట్టాలు ఇవ్వాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత నాది.. ఎమ్మెల్యే నాగరాజు
- వరంగల్‌లో 'ఏబీ బర్ధన్ భవనం' ప్రారంభోత్సవం



అక్షరదర్బార్, వరంగల్: దేశాన్ని మతోన్మాద శక్తులు, కార్పొరేట్ అనుకూల పాలకుల నుండి కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెంఎమ్మెల్యేకూనంనేనిసాంబశివరావు అన్నారు. శుక్రవారం వరంగల్ నగరంలోని మార్కండేయనగర్‌లోనూతనంగానిర్మించిన సీపీఐ కార్యాలయం 'ఏబీ బర్ధన్ భవనం'ను వర్ధన్నపేటఎమ్మెల్యేకేఆర్‌నాగరాజు, సీపీఐరాష్ట్ర సహాయకార్యదర్శితక్కళ్లపల్లిశ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎండీ అక్బర్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ.. కేంద్రంలోని అవినీతి, అసమర్థ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యువతరం గళం విప్పుతోందని, ఢిల్లీలో 'నీట్' పేపర్ లీకేజీపై విద్యార్థులు చేస్తున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోరాడతాయని తెలిపారు.

**పేదల గుడిసెలు కూల్చడం సరికాదు**

రాష్ట్రంలో పేదల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల హామీలను నెరవేర్చాలని కూనంనేని డిమాండ్ చేశారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తుంటే చర్యలు తీసుకోని అధికారులు, నిలువ నీడలేక గుడిసెలు వేసుకున్న నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం పద్ధతి కాదన్నారు. తక్షణమే కూల్చివేతలు నిలిపివేసి, నివాసముంటున్న పేదలకు ఇంటి పట్టాలిచ్చి 'ఇందిరమ్మ ఇళ్లు' మంజూరు చేయాలని కోరారు.

**కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పదిలం**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటుందని, ఎరుపుకు మరణం లేదని కొనియాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదల ఇళ్ల కూల్చివేతలను ఆపేందుకు కృషి చేస్తానని, అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇప్పించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే బాస్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి విజయ్ సారథి, కర్రె భిక్షపతి, నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్, తోట భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, పనాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుముల శేఖరయ్య భౌతికకాయానికి నివాళి

అక్షరదర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుముల రమణాచారి తండ్రి శేఖరయ్య శుక్రవారం ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన స్వగృహానికి చేరుకుని శేఖరయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, పిఏసిఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్ రెడ్డి, జిల్లా, మండల నాయకులు పొంద్రాల వీరాస్వామి, క్యాతం రమేష్ తదితరులు ఉన్నారు.

## నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోవద్దు

- చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్
- టోకెన్ వ్యవస్థ, లక్కీ డ్రాల పేరుతో మోసాలు
- అనుమానాస్పద ప్రచారాలు కనిపిస్తే 100కి సమాచారం ఇవ్వాలి

అక్షరదర్బార్, చిట్యాల : ఆకర్షణీయమైన నకిలీ ప్రకటనలు చూసి ప్రజలు మోసపోవద్దని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. శుక్రవారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... ఇటీవల సోషల్ మీడియాలో "తొలి ఏకాదశి స్పెషల్ ₹500 కొట్టు... మేకను పట్టు!" అంటూ వస్తున్న ప్రకటనల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. కేవలం ₹500 కే 10 కేజీల మేక అంటూ 30 టోకెన్ల పేరుతో ప్రజలను ఆకర్షించి సొమ్ము చేసుకునేందుకు కొందరు కేటుగాళ్లు ఇలాంటి చట్టవిరుద్ధమైన ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. తక్కువ డబ్బు ఆశ చూపి లక్కీ డ్రా, టోకెన్లు, లాటరీ పేరిట నిర్వహించే ఆఫర్లను నమ్మవద్దన్నారు. అనుమతి లేకుండా లాటరీలు, జూదం నిర్వహించడం నేరమని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మోసపూరిత ప్రకటనలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## సాధు సమ్మయ్య అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ

- కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు
- సమ్మయ్య భౌతికకాయానికి ఘన నివాళులు

అక్షరదర్బార్, పరకాల : పరకాల మున్సిపల్ పరిధి 20వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సాధు సర్వేశం తండ్రి సాధు సమ్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం నిర్వహించిన ఆయన అంతిమయాత్రలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ పాల్గొని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బొచ్చు సుభద్ర సాల్మన్, మాజీ కౌన్సిలర్ ఏకు రాజు, నాయకులు బొచ్చు శ్రీనివాస్, రెండ్ల సంపత్, ఏకు రవికుమార్, సోమేశ్వర్, కన్నయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షణ కవచం దోహదం

- మోకుదెబ్బ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్
- నల్లబెల్లి, దుగ్గొండి మండలాల గీత కార్మికులకు రక్షణ కిట్లపై శిక్షణ
- ప్రభుత్వం అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



అక్షరదర్బార్, దుగ్గొండి : గీత కార్మికులు తాడిచెట్లు ఎక్కే సమయంలో జరిగే ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్) ఎంతో ఉపయోగకరమని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ అన్నారు. దుగ్గొండి మండల కేంద్రంలోని రేణుక-ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో బీసీ కార్పొరేషన్, అబ్కారీ శాఖల ఆధ్వర్యంలో నల్లబెల్లి, దుగ్గొండి మండలాలకు చెందిన గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ శిక్షణను గీత కార్మికులు సద్వినియోగం చేసుకుని ప్రమాదాలనుంచి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి కందాల శంకరయ్య గౌడ్, అబ్కారీ శాఖ సీఐ నరేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్, మోకుదెబ్బ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి కందుల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాచర్ల దేవేందర్ గౌడ్, మండల గౌడ సంఘాల అధ్యక్షులు గైని భాస్కర్ గౌడ్, ఊటుకూరి రమేష్ గౌడ్, జక్కి రాములు గౌడ్, ముత్యాల సాంబయ్య గౌడ్, చుక్క సాంబయ్య గౌడ్, అంబాల సదయ్య గౌడ్, బొడిగె రమేష్ గౌడ్, ఊటుకూరి శ్రీనివాస్, దొనికెల సదానందం గౌడ్, కక్కెర్ల ఆనందం గౌడ్, కక్కెర్ల రాజు గౌడ్, కందుల కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు జయ్యారపు అఖిల్
- నర్సంపేట అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థి సంఘాల ధర్నా
- ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్

అక్షరదర్బార్, నర్సంపేట : కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు జయ్యారపు అఖిల్ మాట్లాడుతూ... నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమైన ఎన్టీఏను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేయడాన్ని, మద్దతు తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు



## కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం

- బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు కోగిల మహేష్
- కేటీఆర్ పిలుపు మేరకు ములుగు ప్రభుత్వ ఆస్పత్రిలో సేవా కార్యక్రమం
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని వెల్లడి

అక్షరదర్బార్, ములుగు : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు కోగిల మహేష్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కేటీఆర్ సూచన మేరకు ఆర్భాటాలకు పోకుండా సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ రక్తదానం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ములుగు మాజీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, యువజన విభాగం నాయకులు పాడియా కార్తీక్, పాడియా చంటి, సునావత్ రాజశేఖర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.



## దేశద్రోహులను సమర్థించే కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరు



- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి
- నర్సంపేట వరంగల్ రోడ్డు సర్కిల్ వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం
- విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

అక్షరదర్బార్, నర్సంపేట : దేశ వ్యతిరేక శక్తులకు పరోక్షంగా అండగా నిలుస్తూ రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ తీరును నిరసిస్తూ శుక్రవారం నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్ సర్కిల్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే శక్తులకు కాంగ్రెస్ పదేపదే మద్దతు ఇవ్వడం దురదృష్టకరమన్నారు. నీట్ పరీక్షపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును విస్మరించి రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలో విద్యార్థులు, రైతులు, నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా అరాచక రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కవిత్వాన్ని ఆయుధంగా మలిచిన ప్రజాకవి గుర్రం జాషువా

- జాతీయ అవార్డు గ్రహీత పుల్ల మల్లయ్య
- చిట్యాలలో గుర్రం జాషువా 55వ వర్ధంతి వేడుకలు
- నవయుగ చక్రవర్తి బాటలో నేటి యువత పయనించాలి

అక్షరదర్బార్, చిట్యాల : తన కవిత్వాన్ని ఆయుధంగా మలిచి సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను రూపుమాపేందుకు గుర్రం జాషువా యుద్ధమే చేశారని అంబేద్కర్ ఫెలోషిప్ జాతీయ అవార్డు గ్రహీత, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురుకుంట్ల కిరణ్ అధ్యక్షతన కవి, రచయిత గుర్రం జాషువా 55వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్ల మల్లయ్య మాట్లాడుతూ... "రాజు చనిపోతే తార రాలుతుంది, కవి చనిపోతే తార నింగిని చేరుతుంది" అని చాటిచెప్పిన గొప్ప చక్రవర్తి జాషువా అని కొనియాడారు. బాల్యంలో కుల వ్యవస్థ, అంటరానితనం, అవమానాలు ఎదుర్కొని తన రచనలతో మత, కుల మూఢాచారాలపై గళమెత్తారని తెలిపారు. నేటి యువత ఆయన బాటలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు, మండల నాయకులు పాముకుంట్ల చందర్, దబ్బేట రవి, పర్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- బల్క్ ల్యాండ్ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ రాహుల్ శర్మ
- సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశం
- జిల్లాలో 83 శాతం పూర్తయిన 'ఎస్ఐఆర్' నమోదు




అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లాలోని బల్క్ ల్యాండ్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో భూపాలపల్లి రెవెన్యూ డివిజన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో బల్క్ ల్యాండ్, రీసర్వే, ఎస్ఐఆర్ ప్రక్రియలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బల్క్ ల్యాండ్ సమస్యలపై గ్రామాల వారీగా సర్వే నిర్వహించి నివేదికలు అందజేయాలని తహసీల్దార్లకు స్పష్టం చేశారు. సర్వే నివేదికల ఆధారంగా సంబంధితులకు నోటీసులు జారీ చేసి భూసమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. రీసర్వే కొనసాగుతున్న గ్రామాల్లో బల్క్ ల్యాండ్ సమస్యలున్న ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పైలట్ గ్రామాల నివేదికలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. విధులు నిర్వహించని లైసెన్స్డ్ సర్వేయర్లకు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సాదాబైనామా కింద మొత్తం 39,300 దరఖాస్తులు రాగా, ప్రస్తుతం 26,698 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి వీటిని వేగంగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 83 శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తయ్యిందని కలెక్టర్ తెలిపారు. టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో 99 శాతం నమోదు పూర్తయిందని చెప్పారు.

**మున్సిపాలిటీకి గడువు**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 70 శాతం మాత్రమే పూర్తయినందున, ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించి ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు, కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్, డిఆర్వో వసంత కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డీఓ హరికృష్ణ, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ హరిహర ప్రసాద్, భూపాలపల్లి డివిజన్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

# భద్రతా నియమాలు పాటించాలి

అక్షరదర్బార్, గోరికొత్తపల్లి: విద్యుత్ వినియోగంలో ప్రజలు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని విద్యుత్తు శాఖ ఎస్ఈ రమేష్ తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి సర్కిల్ పరిధిలోని గోరికొత్తపల్లి మండలం నిజాంపల్లి గ్రామంలో విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ రమేష్ గ్రామస్థులకు విద్యుత్ లైన్లకు సమీపంలో అప్రమత్తంగా ఉండాలని, అనధికారిక కనెక్షన్లు తీసుకోవద్దని, ఎలాంటి లోపాలు గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు విద్యుత్తు సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులపై లాఠీచార్జ్ అమానుషం

- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి
- కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్
- నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరపాలి

అక్షరదర్బార్, వెంకటాపూర్ : ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ అమానుషమని ములుగు జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి మండిపడ్డారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ, ఢిల్లీ లాఠీచార్జీకి వ్యతిరేకంగా ఆయన ఆధ్వర్యంలో ములుగు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల ఎదుట నిరసనలు చేపట్టి సంస్థలను మూసివేసారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ నీట్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని, దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వంగ శ్రీశాంత్, రేవంత్, రెడ్డి శ్రీధర్, గుర్రపు ప్రవీణ్, జంగిల్ అఖిల్, కంచం అనిల్, జంగిలి సాయి, రామ్, బన్నీ, మంద రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తా

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్
- ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు

అక్షరదర్బార్, చిట్యాల : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షుడిగా జన్నె యుగేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్ ఆదేశాల మేరకు నూతన మండల కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి, కన్వీనర్ పైడిపల్లి రమేష్, జిల్లా నాయకులు పున్నం రవి, కత్తి సంపత్ తెలిపారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా సాద మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కన్నెబోయిన అశోక్, ఉపాధ్యక్షులుగా సంగ రాజేందర్, మర్రి నరేష్, జాలిగపు కృష్ణయ్య, కార్యదర్శులుగా పువ్వాటి హరికృష్ణ, దొడ్డి శంకర్, బయగాని గణపతి, సాదరాజు, గుర్రపు రమేష్, వేముల శ్రీనివాస్, కోశాధికారిగా కంచర్ల కుమారస్వామి, కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, శశిధర్ రెడ్డి, చక్రపాణి, సంతోష్, రవీందర్, రాజయ్య, నర్సయ్య ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు జన్నె యుగేందర్ మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఉద్యమకారుల సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

